సాక్షి
విశాఖపట్నం
గురువారం ׀ 16 ׀ అక్టోబర్ ׀ 2025


గంజాయి నిర్మూలన అందరి బాధ్యత 10లో


హెచ్‌పీసీఎల్‌తో ఏజీకేర్ ఫౌండేషన్ ఎంవోయూ 10లో


ఆసీస్ జోరుకు బంగ్లా బ్రేక్ వేస్తుందా? 10లో

డ్రెడ్జింగ్‌కి మళ్లీ నకిలీ బాస్?

అక్రమాల పుట్టగా మారిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ మరోసారి వివాదాస్పద నియామకానికి సిద్ధమవుతోంది. నకిలీ ధ్రువపత్రాలతో గతంలో ఉన్నత హోదాలో కూర్చోబెట్టి.. తర్వాత విధుల నుంచి తప్పించిన బోర్డు.. ఇప్పుడు మళ్లీ సంస్థలో అదే వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగించేందుకు చూస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలో కీలకమైన పోస్టు నియామకంలో గుడ్డిగా వ్యవహరించడం వెనక కూటమి ఎంపీ సిఫార్సు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగానే డబ్బులు చేతులు మారాయనీ.. అందుకే సదరు అనర్హుడైన 'నకిలీ' ఉన్నతాధికారిని మరోసారి సింహాసనంపై కూర్చోబెట్టేందుకు అంతా సిద్ధం చేసినట్లు సమాచారం.



డ్రెడ్జింగ్ కార్పొరేషన్ కార్యాలయం

- రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అండతో పావులు కదుపుతున్న అధికారి
- గతంలో ఫేక్ డిగ్రీలతో పాటు సామాజిక వర్గాన్ని మార్చేశారనే ఆరోపణలు
- సంస్థ నష్టాలకూ కారణమయ్యారని దిగువ స్థాయి కేడర్‌కి డిమోషన్
- అదే కుర్చీ కోసం రూ.లక్షలు ముట్టజెప్పేందుకు కేంద్ర మంత్రితో డీల్.!
- ఆధారాలతో సహా సీబీఐకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం : నష్టాల బాటలో పయనిస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను గట్టెక్కించేందుకు చర్యలు తీసుకోవాల్సిన బోర్డు.. చేసిన తప్పునే మళ్లీ చేస్తోంది. సంస్థలో కీలకమైన పోస్టు ఎంపికలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గతంలో నకిలీ సర్టిఫికెట్లతో ఎండీగా, సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జీవైవీ విక్టర్.. సంస్థను కోట్ల రూపాయలకు పైగా నష్టాల ఊబిలో కూరుకుపోయేలా చేశారు. నిండా మునిగిన తర్వాత తేరుకున్న ఉన్నతాధికారులు ఆయన్ని విధుల నుంచి తప్పించారు. తర్వాత జరిగిన ప్రధాన నియామకం కూడా అదేరీతిలో మారి వివాదాస్పదమైంది. సదరు వ్యక్తి 1987లో ఎస్సీ కోటా స్పెషల్ డ్రైవ్‌లో షిప్‌లో డెక్ కేడెట్‌గా డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో చేరారు. 2009లో డీజీఎంగా పదోన్నతి పొంది.. పట్టుమని పది నెలలైనా పని చెయ్యకుండా డీసీఐకు రాజీనామా చేసేశారు. డీసీఐ ప్రత్యర్థి సంస్థగా చెప్పుకునే మెర్కటర్ సంస్థలో డీజీఎం ఆపరేషన్స్‌గా జాయిన్ అయ్యారు. రెండున్నరేళ్లు పనిచేసి తిరిగి 2012లో డీసీఐకి వచ్చేశారు. ఈ సమయంలో డీసీఐలో తిరిగి చేరినప్పుడు విద్యార్హతలకు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలను సమర్పించినా ఆయనకు కీలక బాధ్యతలు కట్టబెట్టేశారు.

అర్హతలన్నీ అబద్ధాలే..!

గతంలో కీలక బాధ్యతల పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు అందులో హిందూగా పేర్కొన్నారు. ఆ సమయంలోనే సదరు అధికారి నగరంలోని యూనియన్‌చాపల్ బాప్టిస్ట్ చర్చ్‌కి వైస్ చైర్మన్‌గా ఉన్నారు. క్రిస్టియన్‌గా ఉంటూ ఉద్యోగం కోసం చేసిన దరఖాస్తులో మాత్రం హిందూగా పేర్కొన్నారని ఆరోపణలు మొదలుకొని.. బీకామ్ డిగ్రీతో పాటు డ్రెడ్జ్ గ్రేడ్ మాస్టర్–1 అర్హతలపైనా విమర్శలు వెల్లువెత్తాయి. డిగ్రీ సర్టిఫికెట్ నకిలీదని గుర్తించారు. అంటే కేవలం ఇంటర్ విద్యార్హత ఉన్న వ్యక్తిని తీసుకెళ్లి సింహాసనంపై కూర్చోబెట్టారన్న ఆరోపణలతో డీసీఐ అట్టుడికిపోయింది. ఈయన వ్యవహారశైలి, తప్పుడు ధృవపత్రాల అంశాలపై గతంలో సీబీఐకి ఫిర్యాదు చేయడంతో విచారణ చేసిన బోర్డు డిమోషన్ చేసి సీజీఎంగా బాధ్యతలు అప్పగించింది.

కేంద్ర మంత్రి సిఫార్సుతో మరోసారి..!

సీజీఎంగా ఉన్న సదరు అధికారికి సింహాసనంపైనే దృష్టి ఉండేది. ఆ కుర్చీ కోసం ఇన్‌చార్జ్‌గా నియమించిన ఉన్నతాధికారిని పక్కనపెట్టేసి.. అన్నీ తానై డ్రెడ్జింగ్‌లో చక్రం తిప్పేవారు. ఇప్పుడు కూటమి పార్టీకి చెందిన ఓ కేంద్ర మంత్రితో రికమెండేషన్ కోసం డీల్ మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. దీనివెనుక రూ.లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు డీసీఐలో వినిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి సిఫార్సులకు బోర్డు కూడా తలొగ్గినట్లు తెలుస్తోంది. త్వరలోనే సదరు వ్యక్తిని కీలకు కుర్చీలో కూర్చోబెట్టేందుకు ఆర్డర్లు కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గతంలో తప్పుడు ధృవీకరణ పత్రాలు, సామాజికవర్గం విషయంలోనూ తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తికి మళ్లీ అవే బాధ్యతలు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ పోర్టులో ఇటీవల బదిలీ అయిన వ్యక్తుల ప్రమేయం కూడా ఇందులో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. మరోసారి 'నకిలీ' అధికారికి డ్రెడ్జింగ్‌లో కీలకబాధ్యతలు అప్పగిస్తే.. సంస్థ నష్టాలతో మరింత దిగజారిపోతుందన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. సదరు 'నకిలీ' ఉన్నతాధికారి.. గతంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కి రాజీనామా చేసి.. మెర్కటర్‌లో చేరిన తర్వాత.. డీసీఐకి నష్టం వాటిల్లేలా వ్యవహరించినట్లు కూడా సీబీఐకి కొందరు ఉద్యోగులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతి విషయంలోనూ సదరు అధికారికి సంబంధించిన నియామకం వెనుక ఉన్న అక్రమాల జాబితాని జత చేర్చుతూ.. కేంద్ర పోర్టులు మంత్రిత్వ శాఖతో పాటు సీబీఐకి మరోసారి ఫిర్యాదు చేసేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ 'నకిలీ' నియామకానికి సహకరిస్తున్న పోర్టు అధికారులపైనా ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

మట్టి ప్రమిదల మహోత్సవం

హిడెన్‌స్ప్రౌట్స్‌లో కనులవిందుగా ప్రమిదల ప్రదర్శన


దివ్యాంగ విద్యార్థులు తయారు చేసిన ప్రమిదలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: ఆ చిన్నారులు ప్రత్యేక ప్రతిభావంతులు. వారి చేతుల్లో రూపుదిద్దుకున్న ఆ మట్టి ప్రమిదలు వేల కాంతులను విరజిమ్మనున్నాయి. దీపావళిని స్వాగతిస్తూ ఎంవీపీ కాలనీలోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగ విద్యార్థులు తయారు చేసిన ప్రమిదల ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. గత కొన్ని రోజులుగా విద్యార్థులు ఎంతో శ్రద్ధగా, కళాత్మకంగా తీర్చిదిద్దిన వేలాది ప్రమిదలను బుధవారం ప్రదర్శించారు. ముఖ్యంగా పాఠశాల పేరు, పవిత్ర కలశం ఆకారంలో దాదాపు 5,000 ప్రమిదలను పేర్చారు. దీనిని తిలకించిన పలువురు.. విద్యార్థుల సృజనాత్మకతను, వారిలోని నైపుణ్యాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. వారి కృషిని మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'కాలుష్య రహిత, పర్యావరణ హితమైన దీపావళిపై సమాజంలో అవగాహన పెంచాలన్నదే మా ముఖ్య ఉద్దేశం. అందుకే ఏటా మా విద్యార్థులతో ఇలా మట్టి ప్రమిదలను తయారు చేయిస్తున్నాం. పాఠశాల నిర్వహణకు అండగా నిలుస్తున్న దాతలకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతగా ఈ ప్రమిదలను బహూకరిస్తాం.' అని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా రియర్ అడ్మిరల్ మనోజ్ ఝూ


మనోజ్ ఝూ

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం(ఈఎన్‌సీ) చీఫ్ ఆఫ్ స్టాఫ్(ఆపరేషన్స్)గా రియర్ అడ్మిరల్ మనోజ్ ఝూ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మనోజ్ ఝూ డీఎస్ఎస్‌సీ (వెల్లింగ్టన్), యూకేలోని రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌లో విద్యనభ్యసించారు. 1995 జనవరి 1న నౌకాదళంలో ఫ్లాగ్ ఆఫీసర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. గోవాలోని నావల్ అకాడమీ, ఇండియన్ నావల్ వార్ కాలేజ్ (గోవా)లో విధులు నిర్వర్తించారు. గన్నరీ నిపుణుడైన మనోజ్ ఝూ.. ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకకు కమాండ్ ఆఫ్ డిస్ట్రాయర్‌గా విధులు నిర్వహించారు. ఏఎస్‌డబ్ల్యూ కర్వెట్ ఐఎన్ఎస్ కమోర్తా యుద్ధ నౌకకు మొట్టమొదటి కమాండింగ్ ఆఫీసర్‌గా, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విరాట్‌లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విజయవంతంగా బాధ్యతలు పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన నేవల్ హెడ్‌క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడి నుంచి ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు రావడం గర్వంగా ఉందని మనోజ్ ఝూ ఈ సందర్భంగా తెలిపారు.

విదేశాలకు తొలిసారిగా మాంగనీస్


మాంగనీస్ ఖనిజంతో పోర్టు నుంచి బయల్దేరిన ఎంవీ హెలెన్ బల్కర్ కార్గో షిప్

సాక్షి, విశాఖపట్నం: తొలిసారిగా విదేశాలకు మాంగనీస్ ఎగుమతి నిర్వహించి విశాఖపట్నం పోర్టు అథారిటీ అరుదైన మైలురాయిని చేరుకుంది. పనామా కాలువకు చెందిన బల్క్‌డ్రగ్ కార్గో క్యారియర్ షిప్ ఎంవీ హెలెన్ బల్కర్ ద్వారా మాంగనీస్ ఖనిజం ఎగుమతైంది. విశాఖపట్నం పోర్టులోని వెస్ట్ క్యూ–4 బెర్త్‌లో 20 వేల మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను బుధవారం సాయంత్రం లోడ్ చేశారు. అనంతరం ఎంవీ హెలెన్ బల్కర్ కార్గో వెసల్ చైనాకు బయల్దేరింది.

విద్యుత్ రంగంలో ఆవిష్కరణలకు హ్యాకథాన్

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'హ్యాక్ ఏపీ హ్యాకథాన్' నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రమాదాలను ముందుగా గుర్తించడం, స్మార్ట్ మీటర్ డేటా విశ్లేషణ ద్వారా ఆదాయ సంరక్షణ, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ ప్రిడిక్షన్, హైటెన్షన్ లైన్లలో ఇన్సులేటర్ వైఫల్యాల గుర్తింపు తదితర అంశాలపై ఆవిష్కరణలను ఆహ్వానిస్తున్నామన్నారు. దీనిని ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ సంయుక్తంగా విశాఖలో నిర్వహిస్తున్నాయని.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతోందని పేర్కొన్నారు. వివరాలు, రిజిస్ట్రేషన్ల కోసం https:// electronvibe. com/ hackap& hackathon/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి 12 వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయని చెప్పారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.82 కోట్లు


ఆదాయం లెక్కిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 44 రోజులకుగాను రూ.2 కోట్ల 82 లక్షల 18 వేల 987ల నగదు, 79.1 గ్రాముల బంగారం, 13.750 కిలోల వెండిని భక్తులు స్వామివారికి సమర్పించారు. భారత్‌కు చెందినవారే కాకుండా దాదాపు 23 దేశాల నుంచి భక్తులు స్వామివారి హుండీలో వారివారి దేశాల కరెన్సీని వేశారు. ఈవో త్రినాథరావు ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో నీటికి కటకట

మహారాణిపేట: కేజీహెచ్‌లో నీటి సరఫరా లేక రోగులు బుధవారం ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రిలో మోటారు పాడవడంతో పలు వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. కొన్ని వార్డులకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో తాగడానికి, ఇతర వినియోగానికి కూడా నీరు లేక రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడ్డారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి తదితరులు రోగులు ఇబ్బంది పడకుండా పలు చర్యలు తీసుకున్నారు. జీవీఎంసీ నుంచి నీరు తెప్పించేందుకు కృషి చేశారు.

మరణంలోనూ వీడని బంధం

- ఒక రోజు వ్యవధిలో మృతి చెందిన వృద్ధ దంపతులు
- అన్యోన్యంగా జీవించి.. మరణంలోనూ కలిసి సాగారు
- వారి మృతితో శోక సంద్రంలో బంధువులు, కుటుంబ సభ్యులు



దేవుడమ్మ, తాతారావు (ఫైల్)

కంచరపాలెం: ఒకరికొకరం జీవితాంతం తోడుగా ఉంటామని బాసలు చేసుకొని మనువాడిన వృద్ధ దంపతులు చివరికి మరణంలోనూ తోడుగా సాగారు. ఒక్క రోజు గడవకముందే ఒకరి తరువాత ఒకరు తనువు చాలించి మరణంలోను దాంపత్య బంధాన్ని చాటుకుని పలువురిని కంటతడి పెట్టించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి బర్మాక్యాంప్ పల్నాటి కాలనీలో నివాసం ఉంటున్న కల్లింపూడి దేముడమ్మ(62) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మరణించింది. బుధవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు సిద్ధమవుతున్న సమయంలో దేముడమ్మ భర్త కల్లింపూడి తాతారావు(66) ఆమె పార్థివదేహం వద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తాతారావు మృతి చెందాడని డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మరణవార్త కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను శోకసంద్రంలోకి నెట్టింది. బతికున్నన్నాళ్లు ఎంతో అన్యోన్యంగా ఒకరంటే ఒకరు ప్రేమతో మెలిగిన వృద్ధ దంపతులు ఒక రోజు గడవకముందే ఒకేసారి తనువు చాలించి ఒకరికొకరు తోడుగా సమాధికి సాగారు. ఎప్పుడు కనిపించినా తోడుగా ఇద్దరు కనిపించే దంపతులు చివరి అంకంలోను కలిసి సమాధి కావడం చూపరులను కలిచివేసింది. బుధవారం సాయంత్రం బర్మాక్యాంప్ శ్మశాన వాటికలో కుమారుడు శ్రీనివాస్, బంధువులు, గ్రామ ప్రజలు అంత్యక్రియలు నిర్వహించారు. కాగా వారి కుమారుడు కల్లింపూడి శ్రీనివాసరావు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ కుటుంబానికి ఆధారంగా ఉన్నాడు. తల్లి దండ్రులను ఒకేసారి కోల్పోవడంతో గుండెలవిసేలా రోదిస్తున్నాడు.

'గూగుల్'కు భూములు ఇవ్వం

తర్లువాడ దళిత రైతుల స్పష్టీకరణ


తర్లువాడలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడకు చెందిన దళిత రైతులు.. తమ భూములను గూగుల్ టెక్‌కు ఇవ్వబోమని స్పష్టం చేశారు. బుధవారం రైతులతో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, తహసీల్దార్ సూరిశెట్టి శ్రీనుబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రైతుల తరపున సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడారు. ప్రకృతిని ధ్వంసం చేసి, వ్యవసాయ భూముల్లో ఇలాంటి సెంటర్లను ఏర్పాటు చేయవద్దన్నారు. వాటిని ప్రత్యేక పారిశ్రామిక ప్రాంతాల్లోనే నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. గూగుల్ సెంటర్ కోసం భూములు తీసుకుని ఇచ్చే పరిహారం, ఉద్యోగాలు తమకు వద్దంటూ రైతులు నినాదాలు చేశారు. ఆర్డీవో చేసిన ప్రతిపాదనలను తిరస్కరించారు. 'మా పొట్ట కొట్టి కూటమి ప్రభుత్వం సంబరాలు చేసుకుంటోంది'అని ఆరోపించారు. సీపీఎం ప్రతినిధి ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రేట్ విశాఖ షాపింగ్ ఫెస్టివల్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జీఎస్టీ 2.0(సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్) కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కోరారు. ఏయూ గ్రౌండ్స్‌లో షాపింగ్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థల సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న స్టాళ్లను పరిశీలించారు. 60కి పైగా షాపులు ఏర్పాటు చేస్తున్నారని, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఫెస్టివల్ జరుగుతుందని తెలిపారు. జీఎస్టీ తగ్గిన నేపథ్యంలో మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకు వస్తువులు ఫెస్టివల్‌లో లభిస్తాయని, విశాఖ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏయూలో పార్టనర్‌షిప్ సమ్మిట్

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నవంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. సమ్మిట్ నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చే మార్గాలను, డెలిగేట్లు, ఇతర ప్రముఖులు, పాల్గొనేందుకు వచ్చే వారికి చేపట్టాల్సిన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అలాగే దీపావళి సందర్భంగా బాణసంచా సామగ్రి విక్రయించే స్టాళ్లను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం రోడ్డుకు అవతల వైపు ఉన్న మైదానాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేట్ జీఎస్టీ అదనపు కమిషనర్ ఎస్.శేఖర్, టూరిజం అధికారి జె. మాధవి, జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, సీఐఐ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులతో 'సదరం'గం

- మా బతుకులతో ఆటలెందుకు?
- పింఛన్లు తొలగించొద్దని వేడుకోలు


కేజీహెచ్‌లో దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తున్న డీఆర్డీఏ సిబ్బంది

మహారాణిపేట: ఏళ్ల తరబడి జీవనాధారంగా ఉన్న పింఛను ఉంటుందో ఊడుతుందో తెలియక దివ్యాంగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియ వారిలో గుబులు రేపుతోంది. సదరం సర్టిఫికెట్ల ప్రకారం 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉందన్న కారణంతో జిల్లా వ్యాప్తంగా 1,150 మంది దివ్యాంగులకు నోటీసులు జారీ చేయడంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. బుధవారం నుంచి నగరంలోని కేజీహెచ్, అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా వైద్య పరీక్షలు ప్రారంభించారు. కేజీహెచ్‌లో 25 మందికి, అగనంపూడిలో 25, కంటి ఆస్పత్రిలో 20, ఈఎన్‌టీలో ఇద్దరికి కలిపి మొత్తం 72 మందికి పరీక్షలు నిర్వహించారు. తమ వైకల్యాన్ని మరోసారి నిరూపించుకోవడానికి, కదల్లేని స్థితిలో ఉన్న వారు కుటుంబ సభ్యుల సహాయంతో ఆస్పత్రులకు రావడం పలువురిని కంటతడి పెట్టించింది. 'అప్పుడు ధ్రువీకరించింది వైద్యులే కదా? ఇన్నేళ్ల తర్వాత మా వైకల్యం ఎలా తగ్గిపోతుంది?'అంటూ బాధితులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. తమ బతుకులతో ఆటలాడవద్దని, మానవతా దృక్పథంతో పింఛన్లు కొనసాగించాలని వేడుకుంటున్నారు.

రోడ్డున పడేయొద్దు



నాకు ఏ ఆధారం లేదు. కూర్చోలేను. లేవలేను. ప్రభుత్వం ఇచ్చే ఈ పింఛనుతోనే నా భార్య, ముగ్గురు పిల్లల కడుపు నిండుతోంది. తెలిసిన పంతులు ఇచ్చిన మూడు చక్రాల బండితో ఇంటింటికీ తిరిగి పౌరోహిత్యం చేసుకుంటున్నాను. ఇప్పుడు పింఛన్ పోతే నా కుటుంబం రోడ్డున పడుతుంది. దయ చేసి మమ్మల్ని ఆదుకోండి.

– పాండురంగ వెంకట శ్రీనివాస్, పందలపాక, ఆనందపురం మండలం

ఇది పోతే మా గతేంటి?



65 ఏళ్ల వయసులో నా కూతురు పట్టుకుంటే గానీ అడుగు ముందుకు వేయలేని స్థితి నాది. పుట్టుకతో వచ్చిన సమస్యకు ఇప్పుడు కొత్తగా పరీక్షలంటున్నారు. పూరి గుడిసెలో నా భార్యాపిల్లలతో పూట గడవడమే కష్టంగా ఉంది. ఈ పింఛను తొలగిస్తారన్న భయంతో బతుకుతున్నాం. ఇది పోతే మా గతేంటి?

– సూరి బంగారి, చిప్పాడ, భీమిలి మండలం

పింఛనే నా ఆత్మగౌరవం



కర్ర లేనిదే కదల్లేను. నా వైకల్యం వల్ల పెళ్లి కూడా చేసుకోలేదు. నా సోదరి కుమార్తె లక్ష్మి ఇంట్లో ఆశ్రయం పొందుతున్నాను. నాకు వచ్చే పింఛను డబ్బు వాళ్లకిచ్చి కడుపు నింపుకుంటున్నాను. ఈ వయసులో ఏ పనీ చేయలేను. ఈ పింఛనే నా ఆత్మగౌరవం. అది కూడా తీసేస్తే నా భవిష్యత్తు అంధకారమే. నాకు అన్యాయం చేయకండి.

– నరగడం నరసమ్మ, చిప్పాడ, భీమిలి మండలం

జీఎస్టీ 2.0తో సామాన్యులకు మేలు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ఏయూక్యాంపస్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 విధానంతో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని స్టేట్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ సీతాలమ్ శేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని ప్రారంభించి, ర్యాలీకి జెండా ఊపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. నూతన జీఎస్టీ విధానం పర్యాటక రంగానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. దీని ద్వారా తక్కువ ఖర్చుతో తీర్థయాత్రలు, వినోద ప్రయాణాలు చేయడం సాధ్యపడుతుందన్నారు. పర్యాటకుల సంఖ్య పెరగడం వల్ల స్థానికంగా ఉండే దుకాణాలు, రెస్టారెంట్‌లు, హస్తకళల వ్యాపారాలు లాభపడతాయని వివరించారు. సీతాలమ్ శేఖర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 విధానంలో రవాణా, కేటరింగ్ వంటి వాటికి డిమాండ్ పెరుగుతుందన్నారు. జిల్లా పర్యాటక అధికారి జె.మాధవి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ కార్తీక్, సీనియర్ అడ్మిన్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు 'షీ' టీమ్స్ నిఘా

డాబాగార్డెన్స్: నగర పరిశుభ్రత, సుందరీకరణ, అభివృద్ధికి జీవీఎంసీ కార్యాచరణ చేపట్టిందని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారవేసే వారిని గుర్తించేందుకు 'షీ' టీమ్స్ నిరంతర నిఘాతో పనిచేస్తున్నాయన్నారు. బీచ్ పరిసరాల్లో వ్యర్థాలు పార వేసే వ్యాపారస్తులు, వాణిజ్య సముదాయాలను గుర్తించి రూ.1000 జరిమానాతో పాటు వారి వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. కాలనీల్లో రోడ్లపై, బహిరంగ ప్రదేశాలు, కాల్వలు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు పార వేసే వారికి రూ.500 జరిమా నా విధిస్తామని స్పష్టం చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయ స్టాళ్లు, వంటశాలలపై తనిఖీలు నిర్వహించి జరిమానా విధిస్తాయన్నారు. నగరంలో అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు, అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దే కార్యక్రమాలు జీవీఎంసీ చేపడుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జీఎస్టీ సైకత శిల్పం



భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్ద బుధవారం వాణిజ్య పన్నుల శాఖ, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాల గురించి విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పం పర్యాటకులు, స్థానికులను ఆకట్టుకుంది. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం ప్రొఫెసర్ సింహాచలం పర్యవేక్షణలో విద్యార్థులు దీనిని రూపొందించారు. జీఎస్టీ తగ్గింపు, దాని వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్లు ఉమాశంకర్‌రావు, రాణి రత్నకుమారి, పర్యాటక శాఖాధికారి అశోక్ వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, బీచ్‌లో విన్యాసాలు చేశారు.

రుషికొండ భవనాలు నాట్ ఫర్ సేల్ అంటూ బ్యానర్లు



బ్యానర్లు ప్రదర్శిస్తున్న జన జాగరణ సమితి నాయకులు

మధురవాడ: రుషికొండ భవనాలు నాట్ ఫర్ సేల్ అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ జన జాగరణ సమితి వినూత్న రీతిలో నిరసన తెలిపింది. బుధవారం మధురవాడ ఐటీ సెజ్, రుషికొండ భవనాలు తదితర ప్రాంతాల్లో బ్యానర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జన జాగరణ సమితి ఉత్తరాంధ్ర కన్వీనర్ తాళ్లవలస దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడి, చేతకానితనంతో రుషికొండ భవనాలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మడానికి చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రుషికొండ సముద్ర తీరంలో ఎంతో విలువైన భవనాలు నిర్మించిందన్నారు. కూటమి ప్రభుత్వానికి వాటిని ఎలా ఉపయోగించుకోవాలో చేతకాకపోతే కేంద్ర ప్రభుత్వానికి వీటిని అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన రుషికొండ భవనాలను రాష్ట్రపతి, గవర్నర్ల బంగ్లాలుగా.. లేకపోతే నేవీ నార్త్ కమాండ్ మ్యూజియంగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కూటమి ప్రభుత్వంపై ఉత్తరాంధ్ర ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు.

సినీనటి సౌమ్యశెట్టిపై ఫిర్యాదు

భీమునిపట్నం: పెందుర్తికి చెందిన సినీనటి సౌమ్యశెట్టి ఒకరి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిందనే ఫిర్యాదును భీమిలి పోలీసులు పరిశీలన చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా కోయిలకొండ మండలం అయ్యవారిపల్లెకు చెందిన కొండాపూర్ లక్ష్మీకాంతరెడ్డికి సౌమ్యశెట్టితో ఏడు నెలల కిందట పరిచయం ఏర్పడింది. ఆమె తన వద్ద డబ్బులు, బంగారం కలిపి పలు దఫాలుగా సుమారు రూ.86 లక్షలు తీసుకున్నట్టుగా లక్ష్మీకాంతరెడ్డి నగర పోలీస్ కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. వీరిద్దరూ భీమిలి వద్ద ఒక రిసార్ట్‌లో కలిసినట్టు ఫిర్యాదులో ఉంది. దీంతో ఈ ఫిర్యాదును పరిశీలించాలని సీపీ ఇక్కడి పోలీసులను ఆదేశించారు. దీనిపై సీఐ తిరుమలరావు మాట్లాడుతూ.. వీరు ఇక్కడికి ఎప్పుడు వచ్చారు? వారి మధ్య ఏదైనా లావాదేవీలు జరిగాయా అన్న విషయాలపై లోతుగా పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.

రైతులపై టీడీపీ నాయకుల దాడి

- రెండెకరాల భూమి స్వాధీనం చేసుకునేందుకు దౌర్జన్యం
- దస్తావేజులపై సంతకం చేయాలని, లేదంటే చంపేస్తామని బెదిరింపు


టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన తండ్రీ కొడుకులు సన్యాసప్పడు, శివకుమార్

తగరపువలస: టీడీపీ నాయకుల ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయి. భూములను కాజేసేందుకు రైతులపై దాడులకు కూడా పాల్పడుతున్నారు. ఆనందపురం మండల పరిధిలో బడుగు రైతులైన తండ్రీ కొడుకులపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనం. ఆనందపురం గ్రామపంచాయతీలో రైతులైన తండ్రీ కొడుకులు చందక సన్యాసప్పడు, శివకుమార్‌లపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బుధవారం రాడ్లతో దాడికి పాల్పడ్డారు. కల్లంలో పనులు చేసుకుంటున్న తండ్రీ కొడుకుల వద్దకు వచ్చిన షిణగం పెద రామారావు, లెంక సన్యాసప్పడు, లెంక నారాయణమ్మ, లెంక నారాయణరావు, లెంక నరసింగరావు కొన్ని దస్తావేజులు తీసుకువచ్చి, వీరి ఫోన్లు లాక్కున్నారు. సంతకాలు చేయాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. అయినప్పటికీ వినకపోవడంతో కర్రలు, కత్తులు, ఐరన్ రాడ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో వీరికి ఛాతీ, తల, వెన్నెముక భాగంలో గాయాలయ్యాయి. తొలుత బాధితులు ఆనందపురం పీహెచ్‌సీకి వెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు వెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. కానీ, 108 సిబ్బంది వీరిని భీమిలి సీహెచ్‌సీకి తరలించి అవసరమైతే ఆటోలో కేజీహెచ్‌కు వెళ్లాలని చెప్పి ఊరుకున్నారు. దీంతో బాధితులు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి వెళ్లారు.

గతంలోనూ రెండుసార్లు దాడి

బాధితులు సన్యాసప్పడు, శివకుమార్ మాట్లాడుతూ గతంలో వీఆర్వో త్రినాథ్, తహసీల్దార్ అంబేడ్కర్ సాయంతో తమకు చెందిన రెండు ఎకరాల భూమి రికార్డులు మార్చి, దొడ్డిదారిన పై టీడీపీ నాయకులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2004, 2014లో కూడా ఇదే విధంగా తమపై దాడికి పాల్పడ్డారన్నారు. నకిలీ డాక్యుమెంట్లతో భూమిని కాజేసి తరచూ దాడులకు పాల్పడుతున్న వీరినుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. ఏడాది క్రితం తమ వ్యవసాయ భూమికి విద్యుత్ వైర్లు కట్ చేయించి, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా వీరే ఎత్తుకువెళ్లి రెండు నెలల పాటు వ్యవసాయాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. వీరిపై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

వివాహిత దారుణ హత్య


నందగిరినగర్‌లో ఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తాటిచెట్లపాలెం: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి నందగిరినగర్‌లో వివాహిత దారుణ హత్యకు గురైంది. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కవల శ్రావణసంధ్యారాణి అలియాస్ సోనీ అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో నివసిస్తోంది. భర్త మణికంఠతో విభేదాల కారణంగా గత ఏడేళ్లుగా వేరుగా ఉంటుంది. బుధవారం సాయంత్రం ఇదే ప్రాంతంలో నివసిస్తున్న ఖండిపల్లి శ్రీను అలియాజ్ పెయింటర్ శ్రీనుతో చిన్న వివాదం తలెత్తింది. కోపోద్రేకుడైన శ్రీను కార్పెంటర్లు ఉపయోగించే కత్తితో శ్రావణి మెడకోసేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫోర్త్ టౌన్ పోలీసులు, క్లూస్ టీం సభ్యులు దర్యాప్తు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు విచారిస్తున్నారు.

బుల్లెట్ బైకులే టార్గెట్

- ముగ్గురు బైక్ దొంగల అరెస్టు
- రూ.14 లక్షలు విలువ చేసే ఏడు బుల్లెట్ బైక్‌లు చోరీ
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ శ్రీనివాసరావు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం రూరల్: జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించాలని మార్గాలు వెతికారు. బైక్ హ్యాండిల్ లాక్‌లను అన్‌లాక్ చేయడం నేర్చుకున్నారు. బైక్‌లను దొంగిలించి తక్కువ ధరకు అమ్మడం అలవాటు చేసుకున్నారు. ఆఖరికి పోలీసుల చేతికి చిక్కారు. బుధవారం రూరల్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం రూరల్ పరిసర ప్రాంతంలో 5 బుల్లెట్ బైక్‌లు, ఆమదాలవలస ప్రాంతంలో 2 బుల్లెట్ బైక్‌లు పోయినట్లు రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. రెండు రోజుల కిందట రాగోలు దూసి ప్రాంతంలో రూరల్ ఎస్ఐ రాము వాహనాలు తనిఖీలు చేస్తుండగా రెండు బుల్లెట్లపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వ్యవహరించడంతో ఆరా తీశామని, అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

ఖరీదైన వాహనాలే ఆదాయ వనరులు..

బుల్లెట్ దొంగతనాలకు పాల్పడిన ఎ-1 దండు రిషి వర్ధన్ స్వస్థలం విశాఖపట్నం. పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఓ వివాహిత హత్య కేసులో ప్రధాన నిందితుడు. పార్వతీపురం రూరల్ పోలీస్టేషన్‌లో ఒక చీటింగ్ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఎ-2 రాయిపల్లి వినోద్ స్వస్థలం సాలూరు కాగా.. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఐదు సారా కేసులు, సాలూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌తో పాటు గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో ఒక డెకాయిటీ కేసు, అలాగే పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసులతో పాటు ఏడు కేసులు నమోదై ఉన్నాయి. ఇతనిపై పార్వతీపురం జిల్లా కలెక్టర్ పీడీ యాక్ట్ కూడా ఓపెన్ చేశారు.

జైలులో పరిచయం.. : దండు రిషివర్దన్, రాయిపల్లి వినోద్‌లు ఇద్దరూ జైలులో ఒకరికి ఒకరు పరిచయమయ్యారు. విలువైన బైక్‌లు దొంగతనం చేసి నంబర్ మారిస్తే ఎవరూ పట్టుకోలేరని ప్లాన్లు గీశారు. గడిచిన మూడు నెలలుగా ఏడు బైక్‌లు దొంగిలించారు. దొంగిలించిన బైక్‌లను మూడో నిందితుడు, బైక్ మెకానిక్ కొత్తూరుకు చెందిన చిట్టి సంతోష్ సెకండ్ హ్యాండ్ బైక్ షోరూమ్ నిర్వాహకుడి సాయంతో విక్రయించారు. వీరి వద్ద నుంచి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

'రుషికొండ భవనాలపై తదుపరి చర్యల్ని ఆపాలి'


మ్యాప్ చూపిస్తున్న పీతల మూర్తియాదవ్

సీతంపేట: ఏపీ టూరిజం అథారిటీ పర్యావరణ నియమాలు, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి రుషికొండ భవనాలను అక్రమంగా ఉపయోగించుకునే ప్రతిపాదనలు పెట్టారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రుషికొండ భవనాల కోసం హాస్పిటాలిటీ కన్సల్టేషన్ నోటీసుకు సంబంధించి ఈ నెల 11న టూరిజం అథారిటీ పబ్లిక్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ హాస్పిటాలిటీ ఆపరేటర్ల కోసం రుషికొండ భవానాల వినియోగంపై ఈ నెల 17న విజయవాడ టూరిజం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు కొన్ని ఎంపిక చేసిన వాట్సాప్ గ్రూపుల్లో, వైబ్‌సైట్లలో పెట్టినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. హైకోర్టులో డబ్ల్యూపీ(పిల్) నెం .241/2021లో పిటిషనర్‌గా ఉన్నానని, కేసు ఇంకా పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉందన్నారు. ఈలోగా ఇలాంటి పబ్లిక్ నోటీసులు సరికాదన్నారు. అధికారులు తదుపరి చర్యలను ఆపకపోతే కోర్టు ధిక్కరణ కింద హైకోర్టును ఆశ్రయిస్తానన్నారు.

క్రాంతి ప్రోపర్టీస్ నూతన కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ, సీఎంఆర్ అధినేత వెంకటరమణ

సీతంపేట : సీతంపేట పరిధి పబ్లిక్ లైబ్రరీ రహదారిలో క్రాంతి ప్రోప్రర్టీస్ నూతన కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ మావూరి వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి పెగడ చిన్నారావు, డైరెక్టర్లు శ్రీనివాసరావు, నాగేశ్వరావు, మార్కెటింగ్ డైరెక్టర్లు శంకరశ్రీనివాస్, కె.పి. శ్రీనివాస్, ఎన్.సూర్యనారాయణ, జి.అనురాధ, బి.జయప్రకాశ్, సాంబశివరావు, శేషశ్రీనివాస్, ఎన్ఆర్ఐ నాయుడు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

మహారాణిపేట: గంజాయి, ఇతర సింథటిక్ డ్రగ్స్ రవాణాను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నేషనల్ నార్కోటిక్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. డ్రగ్స్ రవాణాను పూర్తిగా నిర్మూలించాలని, ఇందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఆదేశించారు. సీపీ మాట్లాడుతూ నగరంలోని వ్యసన విముక్తి కేంద్రాలు, డ్రగ్-వ్యసన విముక్తి కేంద్రాల పనితీరును సమీక్షించి, వాటిని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రైల్వే స్టేషన్ల వద్ద లగేజీ స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో వీధి దీపాలు, అనుమానిత ప్రాంతాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యా, కస్టమ్స్, పోర్ట్, రైల్వే, రోడ్-ట్రాన్స్‌పోర్ట్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లాలో నార్కోటిక్, ఇతర సింథటిక్ డ్రగ్స్ రవాణాను పూర్తిగా నిర్మూలించడంపై చర్చించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేయడంపైనా చర్చ జరిగింది. డీసీపీ-2 మేరీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌తో ఏజ్‌కేర్ ఫౌండేషన్ ఎంవోయూ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ విశాఖ హెచ్‌పీసీఎల్‌తో బుధవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) జి.కిరణ్‌కుమార్, ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎస్.ఎస్.రాజు ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా రూ.35.40 లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు ఈ ఒప్పందంలో పేర్కొన్నారు. ఈ నిధులను స్నేహ సంధ్య ఏజ్‌కేర్ ఫౌండేషన్ గంభీరంలో 200 పడకల ఆస్పత్రికి అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు వినియోగించనుంది. హెచ్‌పీసీఎల్ సంస్థ సామాజిక బాధ్యతకు, సమాజ ఆరోగ్య అభివృద్ధికి ఈ ఒప్పందం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఎస్.సాంబశివరావు, ట్రస్టీలు కుమార్ రాజా, డి.ఎస్.వర్మ, హెచ్‌పీసీఎల్ అధికారుల్లో పీఆర్వో అండ్ కన్సల్టెంట్ సీఎస్ఆర్ ఎం.కాళీ, సీనియర్ మేనేజర్ హెచ్ఆర్ జి.భారతి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక మాస ఏర్పాట్లు

మహారాణిపేట: పవిత్ర కార్తీక మాసం ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని శివాలయాల్లో భక్తుల సౌకర్యార్థం విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎన్. సుజాత అధికారులను ఆదేశించారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా శివాలయాల్లో చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించి.. బుధవారం ఉప కమిషనర్ కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల్లో ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయాలని, వృద్ధులకు వీల్ చైర్లు అందించాలని, చిన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు అందజేయాలని పేర్కొన్నారు. అలాగే వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. తాగునీరు, మజ్జిగ, ప్రసాదం వంటి వాటిని ఉచితంగా పంపిణీ చేయాలన్నారు.

'ఎయిడెడ్ టీచర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయండి'

ఆరిలోవ: ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తక్షణమే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ శర్మ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు లేకపోవడంతో సరైన వైద్యం అందక ఎంతో మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. వినతులు ఇచ్చిన ప్రతి సారీ ఉన్నత విద్యాశాఖ అధికారులు కేవలం ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలు మాత్రమే సేకరించి వదిలేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్పందించి.. వెంటనే ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి, వారి ప్రాణాలు కాపాడాలని యూనియన్ నాయకులు కోరారు.

కొత్త పీఆర్సీ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర్మారావు

మహారాణిపేట : కొత్త పీఆర్సీని ఏర్పాటు చేయడంతోపాటు తక్షణమే మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని, పెండింగ్ డీఏ, డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూ.కూర్మారావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ ఆవరణలో జిల్లా కార్యవర్గ సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర్మారావు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఈనెల 27న ఏలూరులో జరిగే రాష్ట్ర సభ సమావేశానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరు కావాలన్నారు. పెన్షనర్లకు బకాయి డీఏలతోపాటు మెడికల్ రీయింబర్స్‌మెంట్, తదితర అన్ని పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటివరకు 11వ వేతన సవరణ బకాయిలను చెల్లించలేదన్నారు. గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్న 12వ వేతన సవరణ సంఘాన్ని ఇప్పటి వరకు నియమించలేదన్నారు. పింఛనుదారుల సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణకుమార్, ఇతర నాయకులు డి.ఎస్.కె.ప్రకాష్, వి.వెంకటేశ్వర రావు, పి.సత్యనారాయణ, బాపిరాజు తదితర సభ్యులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణంపై దృష్టి


మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏ పరిధిలోని మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణాలను నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని ఆ సంస్థ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో బృహత్తర ప్రణాళిక రహదారుల పనుల పురోగతిపై ఆయన అధికారులు, కాంట్రాకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి రహదారులను వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జీవీఎంసీతో సమన్వయం చేసుకుంటూ.. భూమిని ఇచ్చిన లబ్ధిదారులకు టీడీఆర్‌లను అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఆటంకాలు లేకుండా స్పష్టంగా ఉన్న ప్రాంతాల్లో పెగ్ మార్కింగ్ చేసి పనులను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. అటవీ శాఖకు చెందిన భూములున్న మార్గాల్లో పనులు చేసేందుకు అనుమతులు వేగంగా వచ్చేలా సంబంధిత అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించాలన్నారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, రాంబాబు, సుధీర్, వరుణ్ కార్తీక్ పాల్గొన్నారు.

ఆసీస్ జోరుకు బంగ్లా బ్రేక్ వేస్తుందా?

మహిళల వరల్డ్ కప్‌లో నేడు మరో మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: ఐసీసీ మహిళల ప్రపంచ కప్ క్రికెట్‌లో భాగంగా మరో పోరుకు వైఎస్సార్ స్టేడియం వేదిక కానుంది. విజయాలతో దూసుకుపోతున్న ఆస్ట్రేలియా జట్టుతో గురువారం బంగ్లాదేశ్ జట్టు తలపడనుంది. బుధవారం రెండు జట్ల క్రీడాకారిణులు స్టేడియంలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. ఈ వన్డే మ్యాచ్ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలై.. డే-నైట్ మ్యాచ్‌గా అభిమానులను అలరించనుంది. నాలుగు మ్యాచ్‌లాడి కేవలం రెండు పాయింట్లతో పట్టికలో ఆరో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్‌కు.. ఆసీస్ జట్టు నుంచి తీవ్రమైన సవాలు ఎదురుకానుంది. అయితే 'ఏ జట్టు ఓడిపోవడానికి ఆడదు' అంటూ బంగ్లాదేశ్ కెప్టెన్ సుల్తానా పూర్తి ఆత్మవిశ్వాసంతో తమ జట్టును ముందుకు నడిపించేందుకు సిద్ధమవుతోంది. విశాఖ వేదికగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒంటిచేత్తో జట్టును విజయ తీరానికి చేర్చిన ఆసీస్ వీరనారి ఆట తీరు ఇంకా విశాఖ ప్రేక్షకులకు గుర్తుంది. సిక్సర్ల మోతతో భారీ స్కోర్‌ను సైతం ఛేదించిన ఆసీస్ బ్యాటింగ్ లైనప్ మరోసారి తమ విధ్వంసాన్ని చూపించడానికి సిద్ధంగా ఉంది.

అయితే బంగ్లాదేశ్ సైతం గత మ్యాచ్‌లో చివరి వరకూ పోరాడింది. ఆలౌట్ కాకుండా బ్యాటింగ్ చేయడమే కాక.. విజయానికి చేరువగా వచ్చి గట్టి పోటీనిచ్చింది. బంగ్లాదేశ్ టాప్ ఆర్డర్‌తో పాటు మిడిలార్డర్ కూడా బలంగా ఉంది. మరి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి.!

విశాఖలో ఆంధ్ర- తమిళనాడు రంజీ మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీలో భాగంగా తమిళనాడుతో ఆంధ్ర జట్టు విశాఖ వైఎస్ఆర్ స్టేడియంలోనే మ్యాచ్ ఆడనుంది. ఎలైట్ ఏ గ్రూప్‌లో ఎనిమిది జట్లు తలపడుతుండగా నవంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు ఈ మ్యాచ్ విశాఖలో జరగనుంది. ఎలైట్ ఏలో యూపీ, బరోడా, ఒడిశా, తమిళనాడు, జార్ఖండ్, విదర్భ, నాగాలాండ్‌తో ఆంధ్ర జట్టు పోటీపడుతుంది. ఆంధ్ర ప్రస్తుత రంజీ సీజన్ లీగ్ చివరి మ్యాచ్ జనవరి 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నాగాలాండ్‌తో ఆడి ముగించనుంది. అనంతరం గ్రూప్స్ టాప్‌లో నిలిచిన జట్లు నాకవుట్‌కు చేరుకోనున్నాయి. ఆంధ్ర తరఫున అభిషేక్, భరత్(వికెట్ కీపర్), రషీద్, రికీ బుయ్(కెప్టెన్), అశ్విన్, సౌరబ్, కరణ్, రేవంత్, శశికాంత్, స్టీఫెన్, పృథ్వీ ఆడుతున్నారు. పి.రాజు, విజయ్, సాయితేజ, సందీప్ స్టాండ్ బైగా ఉన్నారు.

భరత్ సెంచరీతో శుభారంభం

కాన్పూర్‌లో బుధవారం యూపీతో తలపడిన ఆంధ్ర జట్టు మూడు వికెట్లకు 289 పరుగులకు తొలి రోజు ఆటను ముగించింది. ఓపెనర్‌గా దిగిన కీపర్ బ్యాటర్ భరత్ 142 పరుగులు చేశాడు. భరత్ రెండో వికెట్‌కు రషీద్‌తో కలిసి 194 పరుగులు జోడించాడు. ఆంధ్రకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న విశాఖ కుర్రాడే రికీబుయ్ రెండు పరుగులు చేసి మూడో బంతికే క్లీన్‌బౌల్డయ్యాడు.

అంబేడ్కర్ విగ్రహ తొలగింపు యత్నంపై కలెక్టర్ ఆగ్రహం

ఆర్డీవో, తహసీల్దార్, ఆర్ఐలకు షోకాజ్ నోటీసుల జారీ

మహారాణిపేట: పెందుర్తిలో అనధికారికంగా అంబేడ్కర్ విగ్రహం తొలగింపునకు ప్రయత్నించిన వ్యవహారంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పూర్తి వివరాలు అందించాలంటూ ఆర్డీవో, తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల(ఆర్ఐ)కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పెందుర్తి మండలం 97వ వార్డు ఏకలవ్య కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తొలగింపు కోసం ఆర్డీవోతోపాటు పలువురు అధికారులు ప్రయత్నించినట్లు పీవో డబ్ల్యూ నాయకురాలు లక్ష్మి గత సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై హైకోర్టులో డాక్టర్ సీహెచ్ శ్రీకృష్ణ రిట్ పిటిషన్ వేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ముగ్గురికీ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం

తాటిచెట్లపాలెం : దీపావళి సందర్భంగా రైళ్లలో దీపావళి మందుగుండు సామగ్రి రవాణా విషయంలో వాల్తేర్ డివిజన్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. రైళ్లలో దీపావళి సామాన్లు తరలించడం రైల్వే చట్టం ప్రకారం నిషేధమని, దీని వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ఎంతో హానికరమని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను మండే స్వభావం గల వాటిని రైళ్లలో రవాణా చేయవద్దని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇటువంటి నిషేధ వస్తువులు రవాణా చేయడం గుర్తిస్తే సమీప రైల్వే అధికారులకు లేదా రైల్వే భద్రతా దళానికి తెలియజేయాలని సూచించారు. ఈ విషయంలో వాల్తేర్ డివిజన్ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేజీహెచ్‌లో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

రోగులు, వారి సహాయకులే లక్ష్యంగా చోరీలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. రోగులు, వారి సహాయకులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడ్డారు. నిద్రిస్తున్న వారి నుంచి మొబైల్ ఫోన్లు, పర్సులు, ఇతర విలువైన వస్తువులు అపహరించారు. గైనిక్, పిల్లల వార్డు, రాజేంద్రప్రసాద్, భావనగర్ వార్డుల్లో ఈ దొంగలు సంచరించారు.కొంత మంది రోగులు, వారి సహాయకులతో స్నేహంగా ఉంటూ అక్కడ చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చీకటి పడితే చాలు కేజీహెచ్‌లో తాగుబోతులు, దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. పర్సులు, సెల్‌ఫోన్లు, ఆభరణాలతో పాటు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల టైర్లు, ఇతర పరికరాలు దొంగిలిస్తున్నారు. గతంలో రెండు, మూడు బైక్‌లను కూడా చోరీ చేశారు. మంగళవారం రాత్రి కొంత మంది దొంగలు పలు సెల్ ఫోన్లు తస్కరించారు. సెక్యూరిటీ సిబ్బంది వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.